
సాక్షి
బాపట్ల
ఆదివారం । 6 । జూలై । 2025



శాకంబరీగా వాసవీమాత

అచ్చంపేట: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారిని భక్తులు శాకంబరీగా అలంకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.70 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,146 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నృసింహుడికి సహస్ర దీపాలంకరణ

మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహస్వామికి శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

అడిగినంత ముట్టజెప్పాల్సిందే!

- జిల్లా అధికారి బరితెగింపు
- సోషల్ ఆడిట్ కోసం రూ.లక్ష
- ఇప్పటి వరకూ 20 సోషల్ ఆడిట్లు
- పనుల మంజూరుకు లక్షల్లో డబ్బులు
- బదిలీలకు భారీగా ముడుపులు
- అధికారుల రీ పోస్టింగులకూ పెద్ద మొత్తంలో డిమాండ్
- స్పందించకపోతే డిప్యూటీ సీఎం తాలూకా అంటూ బెదిరింపులు
- జిల్లా ఉన్నతాధికారి పేరుచెప్పి ప్రత్యేక వసూళ్లు
- ఆందోళన బాటలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది

డ్వామాలో వసూళ్ల బాగోతం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: డ్వామాలో అక్రమ వసూళ్ల బాగోతం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. నిత్యం కోట్లాది రూపాయల పనులు జరుగుతున్న డ్వామాలో వసూళ్ల పర్వం పతాక స్థాయికి చేరింది. ఆ విభాగం ఉన్నతాధికారి కింది స్థాయి ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రతి మండలం నుంచి రూ.25 వేలకు తగ్గకుండా ముడుపులు ఇవ్వాలని షరతు విధించారు. ఇది కాకుండా ప్రతి సోషల్ ఆడిట్‌కు రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 20 సోషల్ ఆడిట్‌లు జరగ్గా రూ.20 లక్షలు వసూలు చేసినట్లు కిందిస్థాయి అధికార వర్గాల సమాచారం. తాజాగా ఈ నెల 8వ తేదీన చీరాల సోషల్ ఆడిట్ ఉండగా రూ.లక్ష సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారిని ఆదేశించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. లక్షలో రూ.50 వేలు జిల్లా ఉన్నతాధికారి పేరు చెప్పి డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి జరిగిన పనులను షాట్ డైరెక్టర్ కార్యాలయం సోషల్ ఆడిట్ చేస్తుంది. అక్కడి నుంచి నలుగురు డీఆర్‌పీలతోపాటు ఒక ఎస్ఆర్‌పీ సోషల్ ఆడిట్‌లో పాల్గొంటారు. డీఆర్‌పీలు గ్రామాల్లో జరిగిన పనులను పూర్తిగా తనిఖీ చేసి ఆ తర్వాత డ్వామా పీడీతో కలిసి తనిఖీలు చేస్తారు. తనిఖీ అధికారులు అక్రమాలు ఎత్తి చూపితే మీరు కక్షతో కంప్లెయింట్ రాశారని చెప్పి డ్వామా అధికారి తన వద్ద పనిచేసే ఏపీడీని విచారణకు ఆదేశిస్తారు. దీంతో జరిగిన అక్రమాలు కనుమరుగవుతాయి. ఇందుకోసం డ్వామా అధికారి ప్రతి సోషల్ ఆడిట్‌కు రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఇబ్బంది రాకూడదన్న ఉద్దేశంతో ఏపీవోలు జిల్లా అధికారి అడిగిన మొత్తం చెల్లించాల్సి వస్తోంది. అయితే పనుల్లో అక్రమాలకు పాల్పడినవారే కాక అక్రమాలు చేయని అధికారులు సైతం కామన్‌గా డ్వామా అధికారికి డబ్బులు చెల్లించాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

ఉన్నతాధికారి పేరు చెప్పి వసూళ్లు

ఇదికాకుండా జిల్లా ఉన్నతాధికారి పేరుచెప్పి ప్రతి మండలం నుంచి రూ.20 వేలు ఇవ్వాలని ఇటీవల డ్వామా అధికారి హుకుం జారీ చేశారు. ఇక ఆ అధికారి బయట అడుగు పెడితే చాలు ఏ మండలానికి వెళ్లినా వాహనం డీజిల్, ఇతర ఖర్చుల పేరున ఏపీవోలు రూ.10 వేలు చెల్లించాల్సిందేనట. ఏ అధికారైనా రూ.10 వేల చెల్లించకపోతే గూగుల్ మీట్‌లో సదరు అధికారికి తిట్ల దండకం తప్పదని పలువురు ఏపీవోలు సాక్షికి తెలిపారు.

వసూళ్లు ఇలా...

- సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఇతర పనులకు సంబంధించి అక్రమాలు జరిగాయని సోషల్ ఆడిట్‌లో తేలడంతో నగరం మండలంలో కొందరు అధికారులను జిల్లా అధికారి సస్పెండ్ చేశారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.
- కొల్లూరు మడంలంలో ఆయిల్‌ఫాం సాగుకు సంబంధించి ఉపాధి కూలీల మంజూరు విషయంలో ఫైల్ శాంక్షన్ కోసం అక్కడి అధికారులపై ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.
- యద్దనపూడి మండలంలో రూ.13 లక్షల విలువచేసే రోడ్డు నిర్మాణం కోసం స్థానిక నేత నుంచి రూ. 2.50 లక్షలు వసూలు చేయగా సదరు రోడ్డు నిర్మాణానికి పర్చూరు ఎమ్మెల్యే ఆమోదం లేదంటూ జిల్లా కలెక్టర్ సదరు పనిని నిలిపి వేయడంతో చివరకు డ్వామా అధికారి తీసుకున్న డబ్బులు వెనక్కి తిరిగి చెల్లించినట్లు తెలుస్తోంది.
- బాపట్లకు ప్రాంతానికి చెందిన ఒక టెక్నికల్ అసిస్టెంట్ యద్దనపూడి బదిలీ కోసం విన్నవించుకోగా జిల్లా అధికారి డబ్బుల కోసం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో ఆ వ్యక్తి 50 కిలోల అలసందలు తీసుకువచ్చి ఇవ్వగా వాటితోపాటు మరో రూ.50 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేయడంతో టెక్నికల్ అసిస్టెంట్ అంత ఇచ్చుకోలేనని చెప్పినా అధికారి ససేమిరా అనడంతో చివరకు రూ.40 వేలు చెల్లించినట్లు సమాచారం.

స్పందించకుంటే బెదిరింపులు

ఉపాధి హామీ పథకంలో కోట్లాది రూపాయల పనులు జరుగుతుండడంతో అంతే స్థాయిలో డ్వామా అధికారి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు డబ్బులు చెల్లించే విషయంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా సరిగ్గా స్పందించక పోయినా తాను డిప్యూటీ సీఎం తాలూకా అని, ఆయన ఓఎస్‌డీ తన బ్యాచ్ మేట్ అంటూ డ్వామా అధికారి బెదిరింపులకు దిగుతున్నట్లు అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. సదరు అధికారి వేదింపులు భరించలేక కిందిస్థాయి అధికారులు, సిబ్బంది త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

జాతీయ లోక్‌అదాలత్‌లో 474 కేసులు పరిష్కారం



రేపల్లె: లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కారం అవ్వటంతోపాటు కక్షిదారులకు సమయం, నగదు ఆదా అవుతాయని సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు హాలులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయశాఖ ప్రతి నెలా లోక్‌అదాలత్ పేరుతో పరిష్కారానికి అవకాశం కల్పిస్తుందన్నారు. రాజీ మార్గమే రాజమార్గంగా గ్రహించి కక్షదారులు కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. మూడు బెంచ్‌ల ద్వారా 474 కేసులను పరిష్కరించారు. వీటిలో 47 సివిల్, 424 క్రిమినల్, 3 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవి సాయిశ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, న్యాయవాదులు కృష్ణారామ్, శ్రీనివాసరావు, గరికపాటి వెంకట గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్తయిన వారాహి నవరాత్రులు



చందోలు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో గత నెల 26 నుంచి ప్రారంభమైన శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవాలు శనివారం పూర్ణాహుతి కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. పూర్ణాహుతి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేద పండితులు బండారం శ్రీరామశర్మ, గంటసాల విద్యాధర శర్మల ఆధ్వర్యంలో జరిగిన వారాహి అమ్మవారి హోమగుండం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా బగళాముఖి అమ్మవారికి దండనాథ వారాహి అమ్మవారి అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

ఎంపీడీఓలకు ఒక్కరోజు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన ఎంతో కీలకమని జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు పేర్కొన్నారు. శనివారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 వెర్షన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీఓలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్ఏ) వార్షిక ప్రణాళిక రూపకల్పనపై అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయి కుమార్, రాష్ట్రస్థాయి శిక్షకుడు డి.రవీంద్రబాబు, డీపీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, జిల్లాస్థాయి లో వివిధ శాఖల అధికారులు పాల్గొని శిక్షణ కల్పించారు.

నృసింహుని ఆదాయం రూ.57.59లక్షలు



మంగళగిరిటౌన్: మంగళగిరి పట్టణంలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్‌లో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ.57,59,764 వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ సన్నిధి హుండీ ఆదాయం రూ.25,52,133 దిగువ సన్నిధి హుండీ ఆదాయం రూ.30,57,173, ఘాట్‌రోడ్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.87,409లతోపాటు అన్నదానానికి రూ.63,049 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. గతంలో కంటే రూ.11,95,012లు అధికంగా వచ్చినట్లు ఆయన వివరించారు.

లోక్ అదాలత్‌లో 5,300 పైగా కేసులు పరిష్కారం



ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల్లో 5300కు పైగా కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. భారతి పేర్కొన్నారు. జిల్లాలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 27 బెంచీల ద్వారా పరిష్కారమైన కేసుల వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. 5200కు పైగా క్రిమినల్ కేసులు, 155 సివిల్ దావాలతో పాటు 17 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. మోటార్ వాహన ప్రమాద బీమా తదితర కేసుల్లో రూ.8 కోట్లకు పైగా కక్షిదారులకు పరిష్కార చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి బెంచీలో న్యాయమూర్తితో పాటు న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు, పోలీసులకు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, బీమా సంస్థల ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందనలు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ తదితరులు నిరంతరం పర్యవేక్షించారు.

ఎయిమ్స్‌లో 13 మంది విద్యార్థుల సస్పెన్షన్

మంగళగిరి: ఎయిమ్స్‌లో మెడికల్ విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్లు అధికార ప్రతినిధి వంశీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేశామని పేర్కొన్నారు. ఏడాదిన్నరపాటు 13 మంది విద్యార్థులపై ఈ సస్పెన్షన్ విధించామని వివరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

బాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య

- ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో మోసం
- చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం
- కూటమికి ఓటు వేసి తప్పు చేశామన్న విషయం ప్రజలకు తెలియాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



ప్రజలకు చూపాల్సిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): చంద్రబాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని, ఆయన చేసిన మోసాలను ప్రజలలోకి తీసుకెళ్దాం అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున విమర్శించారు. పర్చూరు నియోజకవర్గ స్థాయి 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా క్యాడర్ సమాయత్త సభ ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి అధ్యక్షత వహించారు. నాగార్జున మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' అనే కార్యక్రమం ద్వారా చంద్రబాబు అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను ఏడాదిన్నర కావస్తున్నా అమలు చేయకపోగా ప్రజలను మోసం చేసే విధానాలను ప్రజలలోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం విషయంలో ఆయన గొప్ప ఆవిష్కరణలు చేపట్టి, కులం, మతం, పార్టీ అని చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప వ్యక్తి జగన్‌మోహనరెడ్డి అని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏవిధంగా ప్రజలను మోసం చేసిందో అందరికీ తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ వైఎస్ కూటమి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని అన్నారు. పొగాకు కంపెనీలకు, పార్టీ నాయకులకు మేలు చేసేందుకే బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కూటమి ప్రభుత్వ తీరు కన్పిస్తుందని విమర్శించారు. పొగాకు, మిర్చి, కంది, శనగ, మినుములు, పసుపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి గాదె మధుసూదన రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో చూపించిన కార్యక్రమాలు అమలు చేయలేదనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, క్యూఆర్ కోడ్‌ను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, పర్చూరు పంచాయతీరాజ్ అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషా వలి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పార్టీ మండల కన్వీనర్‌లు జంపని వీరయ్యచౌదరి, కఠారి అప్పారావు, మున్నం నాగేశ్వరరెడ్డి, చిన్ని పూర్ణారావు, ఉప్పలపాటి చెంగలయ్య, పావులూరు సర్పంచ్ బొల్లెద్దు లుధియమ్మ, సీనియర్ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, కొల్లా వెంకటరావు, గడ్డం మస్తాన్‌వలి, బిల్లాలి డేవిడ్, దాసరి వెంకట్రావు, యూ అనిల్, కుమ్మరి చందు, కాటి లక్ష్మణ్, పాలేరు వీరయ్య, ఎంపీపీలు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



లబ్ధిదారులకు పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు వేగేశన, ఆనందబాబు

బాపట్ల: ప్రభుత్వం అందించే వివిధ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులు అందిపుచ్చుకొని వారి స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు యంత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల జీవనోపాధి మెరుగుపరచుకోవడానికి మెప్మా ద్వారా చీరాల మండలంలో 2, బాపట్ల మండలంలో ఇద్దరు లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ ఆటోలను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు అందజేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 646 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా, 3686 మందికి శ్రీనిధి పథకం ద్వారా, 384 మందికి లక్ పతి దిది ద్వారా, 14 మంది సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా 53 కోట్ల 42 లక్షల రూపాయల చెక్కును, మెప్మా శాఖ ద్వారా 340 మంది స్వయం సహాయక గ్రూపు సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా సూక్ష్మ చిన్న, మధ్య తరహా రుణం క్రింద రూ.5 కోట్ల 20 లక్షల చెక్కులను అందజేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజ్ దేబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎం జ్యోత్స్న పాల్గొన్నారు.

ప్రతి ఏటా జీడీపీలో 15శాతం వృద్ధి రేటు పెరిగేలా చూడాలి

బాపట్ల జిల్లా జీడీపీలో ప్రతిఏటా 15 శాతం వృద్ధి రేటు పెరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ బాపట్ల జిల్లా అన్ని రంగాలలో వృద్ధి సాధించాలంటే అందుబాటులో ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అధికారులంతా సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతుల పరిస్థితి పునరావృతం గాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలన్నారు. ఆక్వా రంగంలోనూ లాభసాటి సాగు జరిగేలా రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్లన్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మోసం చేయడంలో బాబు బహుముఖ ప్రజ్ఞాశాలి
- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున
- చీరాలలో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున

చీరాల అర్బన్: ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు అమలు కాని హామీలను గుప్పించి అధికారం చేపట్టిన తర్వాత హామీలను విస్మరించి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు బహుముఖ ప్రజ్ఞాశాలి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. శనివారం సాయంత్రం చీరాల మండలంలోని రామకృష్ణాపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అంశంపై నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ గురించి ప్రశ్నిస్తే నాలుక కట్ చేస్తామని చంద్రబాబు అనడం ఆయన అహంకారానికి నిదర్శమన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తానని చెప్పి రూ.2 వేలు తగ్గించి జమ చేశారన్నారు. సాకుల పేరుతో చాలా మందికి డబ్బులు జమ కాలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను మూలన పెట్టేశారన్నారు. సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. పొగాకు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. అధికార పార్టీ పెట్టే అక్రమ కేసులపై ఎవరూ భయపడవద్దని, పార్టీ అందరికి అండగా ఉంటుందన్నారు.

పథకాల్లో ఎన్నో కోతలు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేసి నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూఆర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఏవిధంగా ప్రజలకు వివరించాలనేది పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కర్నేటి వెంకట ప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, బీసీ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బత్తుల అనిల్, చీరాల మండల అధ్యక్షుడు ఆసాది అద్దంకిరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవ, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ కబీర్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ చీరాల అధ్యక్షుడు రాజు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బిట్రా శ్రీనివాసరావు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, వేటపాలెం పార్టీ మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సకాలంలో అదనపు గదుల నిర్మాణం



బల్లికురవ: కేంద్ర ప్రభుత్వ నిధులతో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో నిర్మాణంలో ఉన్న అదనపు గదులను సకాంలో పూర్తి చేయిస్తామని ఎస్ఎస్ఏ బాపట్ల, పల్నాడు గుంటూరు జిల్లాల ఈఈ నాగజ్యోతి తెలిపారు. శనివారం బల్లికురవలో ఆమె రూ.1.65 కోట్లతో కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న ఆరు అదనపు గదులకు సంబంధించి కప్పు వేసే పనులను ఆమె పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో ఈ విద్యాసంవత్సరం మార్చి నాటికి విద్యాయాలనికి గదులను అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా స్థాయి పెంచడం కోసం అదనపు గదులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఏఈ రాజన్‌బాబు, ఎంఈఓ -2 , కె.రమేష్ బాబు, విద్యాలయం ప్రిన్సిపాల్ బోనా సరళకుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40 మంది అధికారులను 13 టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పాటు చేసి ఏకకాలంలో తనిఖీలు చేశారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు విత్తన దుకాణాలు, మాన్యుఫాక్చరింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు, రిటైల్, హోల్ సేల్ దుకాణాల్లో శనివారం ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నట్లు గమనించామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఆ విత్తనాల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రూ.4.72 కోట్ల విలువైన 704.84 కిలోల మిర్చి విత్తనాలు, రూ.5.65 లక్షల విలువ గల మరో 293.85 కిలోల ఇతర విత్తనాల అమ్మకాలను నిలిపివేశామని పేర్కొన్నారు. విధిగా ధరలు, స్టాక్ పట్టికలను ఏర్పాటు చేయాలని దుకాణాదారులను ఆదేశించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. తనిఖీల్లో జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునికీకరించని లాకులు...అన్నదాతకు కష్టాలు





దెబ్బతిన్న లాకులు

శిథిలావస్థలో నల్లమడ షట్టర్లు

- ప్రతి ఏడాదీ మరమ్మతుల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారగణం
- ఆందోళనలో దిగువ ప్రాంత రైతులు

బాపట్ల: నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు కొమ్మమూరు కాలువపై నరసాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన లాకులు..షెట్టర్లు శిథిలావస్థకు చేరాయి. బ్రిటిష్‌కాలం నాటి 15 షెట్టర్లకు తోడు మరో 10 షెట్టర్లు నిర్మించారు.

ఆ తర్వాత వాటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం వచ్చే నీటికి అడ్డుకట్ట వేయలేకపోవటంతో ఎగువ ప్రాంతాలకు నీరు సక్రమంగా పారుదల లేకపోవటంతో రైతులు అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి తాత్కాలికంగా తన సొంత ఖర్చులతో లాకులకు మరమ్మతులు చేయించారు. రైతులకు కొంత ఉపశమనం కలిగించాయి. ఈ ఏడాది మరమ్మతులకు అవకాశం లేకపోవటంతో రైతులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.



నల్లమడ లాకుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డు


నల్లమడ లాకుల ఏర్పాటు ఇలా...

కృష్ణాపశ్చిమ డెల్టా నుంచి 69.545 కిలో మీటర్ల మేరకు కొమ్మమూరు కాలువ నరసాయపాలెం వద్ద ఉన్న నల్లమడ లాకుల వద్దకు చేరుకుంటుంది. కొమ్మమూరు కాలువ మొత్తం ఆయకట్టు 2.15 లక్షల ఎకరాలు కాగా అనధికారిక సాగు మరో 50 వేల ఎకరాలు ఉంటుంది. ఈ మేరకు దుగ్గిరాల వద్ద 3600 క్యూసెక్కులు వదిలినప్పటికీ బాపట్ల చానల్, పీటీ చానల్‌లకు పోగా నల్లమడ లాకుల వద్దకు 1100 క్యూసెక్కులు వస్తోంది. ఇక్కడ నుంచి 70,599 ఎకరాల ఆయకట్టు ఉండగా ఎగువ కాలువ మట్టం(లోతు)11.92 అడుగులు ఉండగా దిగువ ఆయకట్టు 8.92 అడుగులు ఉంటుంది. వెడల్పు ఎగువ ప్రాంతంలో 64.0 అడుగులు ఉండగా దిగువ ప్రాంతంలో 48.0 అడుగులు ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి నరసాయపాలెం, వెదుళ్లపల్లి, చెరుకుపల్లి ట్యాంకు కాలువ, పెద్దగంజాం వరకు ఈ లాకుల నుంచే నీరు వెళుతుంది. ఈ లాకుల వద్ద కనీసం ఆరు అడుగులు లోతులో నీటి నిల్వ ఉంటే గానీ బాపట్ల, పీటీ చానల్‌కు నీటి పారుదల ఉండే అవకాశం లేదు.

శిథిలావస్థలో లాకులు...షెట్టర్లు

బ్రిటిష్‌కాలంలో ఏర్పాటు చేసిన లాకులు, షెట్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నల్లమడ వద్ద లాకులు, ఉప్పరపాలెం వద్ద ఉన్న షెట్టర్లు శిథిలావస్థకు చేరాయి. ఉప్పరపాలెం వద్ద ఉన్న 15 షెట్టర్లు బ్రిటిష్ కాలం నాటివి కాగా 10 షెట్టర్లు 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. కాలువ మరమ్మతులు చేయకుండా షెట్టర్లు ఏర్పాటు చేయటం వలన అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆ కాలంగా కురిసే వర్షపు నీటికి తోడు పంట కాలువలో ఉండే నీటితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లాకులు, షెట్టర్లు దెబ్బతిని పోవటంతో కీలకమైన సమయంలో నీటి నిల్వలకు ఇబ్బందికరంగా మారిపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మాత్రం ఆధునికీకరణ నిధులు వస్తే పూర్తిస్థాయిలో లాకులు, షట్టర్లు మరమ్మతులు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.


నల్లమడను పట్టించుకోవట్లేదు..



నల్లమడ డ్రెయిన్‌ను పట్టించుకోకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కొద్ది మేర పూడికతీత పనులు చేపట్టారు. ఎమ్మెల్యేగా కోన రఘుపతి ఉన్నప్పుడు ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు పంపారు. తక్షణ చర్యలలో భాగంగా సొంత ఖర్చులతో కొద్దిమేర బాగుచేయించారు. కూటమి ప్రభుత్వం నల్లమడ గురించే పట్టించుకోవటం లేదు.దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

–గవిని కృష్ణమూర్తి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

కూటమి ప్రభుత్వానికి లెక్కలేదు



రైతులంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదు. నల్లమడ డ్రెయిన్ గురించి ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవటం లేదు. లాకులు సరిగా లేకపోవటంతో నీటి వృథా కూడా ఎక్కువగానే ఉంది. అవసరమైనప్పుడు సరిపడా నీరు రాకపోవటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేపట్టాలి.

–పిన్నిబోయిన ప్రసాద్, రైతు

బైక్ దగ్ధం.. కేసు నమోదు

సంతమాగులూరు(అద్దంకి): బైక్‌ను దగ్ధం చేసిన విషయంలో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య శనివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పరిటాలవారిపాలెం గ్రామంలో వ్యక్తిగత కారణాలతో కొమ్మాలపాడుకు చెందిన ఖాజావలి, నాగూర్‌బాబు మధ్య వ్యక్తిగత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో ఖాజావలి తన మిత్రులతో కలిసి వచ్చి నాగూర్ బాబు బైక్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు కేసు నమోదు అయింది.

చంద్రబాబుకు దళితులపై అక్కసు ఎందుకు?



ఒన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- సీఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల టౌన్: 'రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు దళితులను కుక్కలతో పోల్చి మరోసారి అక్కసు వెళ్లగక్కారు. దళితులంటే సీఎంకు ఎందుకు అంత చిన్నచూపు? దళితుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన సీఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి' అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు డిమాండ్ చేశారు. శనివారం చీరాల ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావును వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్, వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి చంద్రబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వాసిమళ్ల వాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పట్టణాధ్యక్షుడు యాతం మేరిబాబులు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడుకు దళితులంటే ఎప్పుడూ చులకన భావమేనని రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సింగయ్యను కుక్కతో పోల్చడం దుర్మార్గమన్నారు. దళితుల ఓట్లు కావాలని.. కానీ వారు కుక్కలంటూ అగ్రవర్ణ భావజాలంతో, పదవీ అహంకారంతో మాట్లాడిన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పాలనలో ప్రజలు, పార్టీల నాయకులును వేధిస్తూ దుర్మార్గ పాలన చేస్తున్న ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. గతంలో సీఎంగా చంద్రబాబు ఉన్న హయాంలో గోదావరి పుష్కరాల సమయంలో చాలామంది చనిపోయారని, ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కూడా కందుకూరు, ఇతర ప్రాంతాల్లో ప్రజలు చనిపోయినా కనీసం స్పందించకుండా దుర అహంకారాన్ని ప్రదర్శించారన్నారు. వైఎస్సార్ సీపీలో దళితులకు సముచిత స్థానం ఇచ్చి ఉన్నత పదవులు కట్టబెటితే.. చంద్రబాబు మాత్రం దళితులను కుక్కలతో పోల్చడం హేయమన్నారు. ఇదే పంథా కొనసాగిస్తే చంద్రబాబుకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కంపా అరుణ్, బత్తుల అనీల్, పార్టీ నాయకులు గవిని శ్రీనివాసరావు, కోడూరి ప్రసాద్‌రెడ్డి, రాఘవ, వాసిమళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం

నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

చీరాల అర్బన్: మహిళలందరికీ ఆగస్టు 15న మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేసేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ జంజనం శ్యామల, బీజేపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్సులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో పైకప్పు పెచ్చులూడిపోయి ప్రమాదభరితంగా ఉండటాన్ని గుర్తించి వాకబు చేశారు. మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి వసతి లేకపోవడాన్ని గుర్తించారు. మరుగుదొడ్లలో అధికంగా వసూలు చేయవద్దని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రైవేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ బస్సులను తీర్చిదిద్దాలన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు అవుతున్న ఉచిత ఆర్టీసీ పథకానికంటే భిన్నంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ యూనియన్ల ప్రతినిధులు, రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు జోనల్ చైర్మన్‌ను సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కొత్రపు జనార్దన్, బీజేపీ సీనియర్ నాయకులు మువ్వల వెంకటరమణారావు పాల్గొన్నారు.



బస్టాండ్ పైకప్పు పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి కిషోర్‌బాబు

రేపల్లె: గుంటూరు ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024–25 విద్యాసంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, నగదు బహుమతులు అందించనున్నట్లు నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఆగస్టు 10వ తేదీన పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో జరిగే ప్రతిభా పురస్కారాల సభలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు సత్కరించనున్నట్లు తెలిపారు. మెడికల్, పీజీ, ఇంజినీరింగ్‌లలో జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన వారికి గోల్డ్‌మెడల్‌తో సత్కరిస్తామన్నారు. పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. ప్రతిభగల విద్యార్థులు, పేద విద్యార్థులు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో ఈ నెల 20వ తేదీలోపు ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ, 1వలైన్, ఆదిత్యనగర్, గుంటూరు అడ్రస్‌కు పంపాలన్నారు. దరఖాస్తుతో ర్యాంక్ కార్డు, మార్కుల జాబితా, తల్లిదండ్రుల వృత్తి, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ సర్టిఫికెట్‌లు జత చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 9393138248 నంబరులో సంప్రదించాలన్నారు.

కల్తీ మద్యం తయారీ ముఠా అరెస్ట్

రేపల్లె: కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. రేపల్లె మండలం మోళ్లగుంట గ్రామంలో కల్తీ మద్యం తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గ్రామంలోని మోపిదేవి సతీష్ గృహాన్ని పరిశీలించారు. గృహంలో కల్తీ మద్యం తయారు చేసే ముడి సరుకుతో పాటు మద్యం నిల్వ ఉంచే టిన్‌లు, క్వార్టర్ సీసాలు కనిపించాయి. మోళ్లగుంటకు చెందిన మోపిదేవి సతీష్, కన్నా రాములతోపాటు కృష్ణాజిల్లా గుల్లలమోద గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి సూర్యలను అదుపులోకి తీసుకున్నారు. మోపిదేవి సతీష్, సూర్య, రాములతోపాటు మరో ముగ్గురు కలిసి గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఇథనాల్ ఆల్కహాల్ 10 లీటర్లు, 21 ఖాళీ క్యాన్‌లు, 510 ఖాళీ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన సూత్రధారి అయిన యానం శ్రీను అలియాస్ నులికుర్తి శ్రీనివాస్ హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి ఇథనాల్ ఆల్కహాల్‌ను సతీష్‌కు పంపుతాడు. ఆల్కహాల్‌లో రంగు నీరు కలిసి సతీష్, సూర్య, రాములు 180 మిల్లీలీటర్ల సీసాలలో నింపి చుట్టు ప్రక్కల ప్రాంతాలలో విక్రయిస్తూ అక్రమంగా నగదు సంపాదిస్తున్నాడు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన యానం శ్రీను, రూతుల శ్రీనివాస్ (హైదరాబాద్), చరణ్‌జిత్ (హైదరాబాద్)లను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ అధికారి తెలిపారు. వీరిరువురికి హైదరాబాద్‌లో ఉన్న నకిలీ మద్యం తయారీ ముఠాతో సంబంధాలు ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జనార్థన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మధుబాబు, ఎక్సైజ్ సీఐ దివాకర్, ఎస్ఐలు రాజ్యలక్ష్మి, రామారావు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు

కిరాణా షాపులో మద్యం బెల్టు షాపు

బలిజేపల్లి(వేమూరు): కిరాణా షాపులో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేమూరు మండలం బలిజేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు బంధువులు మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. బలిజేపల్లి గ్రామంలో మద్యం బెల్టు షాపులతోపాటు గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వ్యక్తం చేశారు. అధికారులు గ్రామంలో మద్యం బెల్టు షాపు, గంజాయి అమ్మకాలు నిర్మూలన చేయాలని కోరారు.



కిరాణా షాపులో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు

నీటి మోటార్ల దొంగలు అరెస్ట్

నాలుగు మోటార్లు స్వాధీనం



వేటపాలెం: పొలాల్లో సాగు నీటికి ఉపయోగించే మోటార్లు దొంగిలించే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.జనార్దన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలేనికి చెందిన రైతు మర్రి నాగార్జున తమ పంట పొలాలకు ఉపయోగించి నీటి మోటార్లు దొంగతనానికి గురైట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కొణిజేటి చేనేత కాలనీలో నివాసం ఉంటున్న షేక్ నాసిర్ వాలి, వేటపాలెం మార్కెట్ సెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ సుభాని.. ఇద్దరు చెడు వెసనాలకు అలవాటు పడి పొలాల్లో ఉండే మోటార్ల దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మేరకు నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 5 హెచ్‌పీ మోటార్లు మూడు, 2 హెచ్‌పీ మోటార్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. నిందితులిద్దరినీ చీరాల కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

15న జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌తోపాటు వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును ఆగస్టులో బాపట్లలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

నేడు అండర్–14 పికిల్ బాల్ పోటీలు

వివిచి హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని క్లబ్‌లో అండర్- 14 బాలబాలికల ఓపెన్ పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తామని క్లబ్ డైరెక్టర్ టి.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.